క్లుప్తంగా

94 శాతం పింఛన్ల పంపిణీ

బత్తలపల్లి: మండల వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. వృద్ధాప్య, వితంతు, వికలాంగ తదితర సామాజిక పింఛన్లు మొత్తం 6,192 ఉన్నాయి. ఆదివారం సాయంత్రం 5 గంటలకు 5,830 మందికి పింఛన్ సొమ్ము అందజేశారు. పింఛన్ల పంపిణీ 94 శాతం పూర్తయింది. వలంటీర్లు సకాలంలో పింఛన్లు అందజేస్తుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పుట్టపర్తికి భక్తుల పాదయాత్ర


సత్యసాయిబాబా చిత్రపటంతో పాదయాత్ర చేస్తున్న శ్రీసత్యసాయి సేవా బృందం

ధర్మవరం అర్బన్: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ధర్మవరం నుంచి పుట్టపర్తికి శ్రీసత్యసాయి సేవా బృందం సభ్యులు ఆదివారం పాదయాత్రగా తరలివెళ్లారు. తొలుత సత్యసాయిబాబా చిత్రపటాన్ని పల్లకీలో కొలువుదీర్చి పట్టణంలో ఊరేగించారు. అనంతరం పుట్టపర్తికి పాదయాత్రగా బయలుదేరారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తులు నామా రామప్రసాద్, కాకి చంద్రశేఖర్, రామకృష్ణ, సాంబశివుడు, లక్ష్మీనారాయణ, చౌడమ్మ, శివమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కోడేకండ్ల పెద్దమ్మకు మారుపూజ


మారుపూజలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బత్తలపల్లి: మండలంలోని కోడేకండ్ల గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లికి మారుపూజ చేశారు. మే 23వ తేదీన గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు రాజ వీరారెడ్డి, బండి వీరనారప్ప, సోమశేఖర్, బండి ఆదినారాయణ, పెదయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాట మారెమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో బాట మారెమ్మ దేవత

కనగానపల్లి: మండల కేంద్రం సమీపంలో ప్రధాన రహదారి పక్కన వెలసిన బాట మారెమ్మ దేవతకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు తమ కోరికలు తీరాలని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి, బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు, వెండి ఆభరణాలు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

దేశభక్తిని పెంచుకోవాలి


గురుపూజోత్సవంలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ సహ వ్యవస్థ ప్రముఖ్ సర్వేశ్వరన్ తెలిపారు. పట్టణంలోని వాసవీ కొత్త సత్రంలో ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడిపినప్పుడే మానవుడికి గుర్తింపు లభిస్తుందన్నారు. నిరంతరం దేశ అభివృద్ధికి అందరూ సహకారం అందించాలని తెలిపారు.

గురుపౌర్ణమికి ముస్తాబు

కదిరి టౌన్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయాల్లో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. భక్తుల దర్శనార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉదయం 5 గంటలకు కాగడ హారతి, 6 నుంచి 7 గంటల వరకూ క్షీరాభిషేకం, 7 నుంచి భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అమడగూరు:అమడగూరు, జేకేపల్లి గ్రామాల్లో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి పేర్కొన్నారు. సాయిబాబా విగ్రహ ఊరేగింపు, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాల వర్తింపు
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


నాయనాకోట తండాలో వృద్ధులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీ చెరువు: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. అర్హతే ప్రామాణికంగా కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం మండలంలోని కొండకమర్ల సచివాలయం-2 పరిధిలోని నాయనాకోట తండా, నాయనాకోట, వీరప్పగారిపల్లి, ఎద్దులవాండ్లపల్లి, మారుతీ తండా, చెరువువాండ్లపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎద్దులవాండ్లపల్లి గ్రామంలో ఎమ్మెల్యేకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు దుర్గాప్రసాద్‌నాయక్, కార్యకర్తలు, మహిళలు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, గ్రామ వలంటీర్లతో కలసి ఎమ్మెల్యే గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. అర్హత ఉండి కూడా ఇంకా సంక్షేమ పథకాలు అందని వారి కోసం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. అర్హత ఉన్న వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు.

మోసం చేయడం బాబుకు అలవాటే..

ఏ రాష్ట్రంలో లేనివిధంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రతి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధి చేకూర్చుతోందన్నారు. పథకాల సొమ్మును నేరుగా వారి ఖాతాల్లోకే జమ చేస్తుందని గుర్తు చేశారు. మాయ మాటలతో మభ్యపెట్టడం చంద్రబాబుకు అలవాటే అని ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలిచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చకుండా గాలికొదిలేశారన్నారు. ప్రజలను నిలువునా మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో కనీసం డిపాజిట్ అయినా దక్కించుకోవాలనే తపనతో చంద్రబాబు అబద్ధపు హామీలు ఇస్తున్నారని తెలిపారు. బాబుకు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మరో మారు సీఎం వైఎస్ జగనన్నను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ ఆనందరెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మీరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు ఎద్దుల రాముసుబ్బారెడ్డి, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాషా, మండల కో-ఆప్షన్ సభ్యుడు నిసార్ అహమ్మద్, సర్పంచ్ జగన్‌మోహన్ చౌదరి, మాజీ సర్పంచ్ మారెన్న, నాయకులు దుర్గాప్రసాద్ నాయక్, వెంకటనారాయణ, మధుసూదన రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


వెంకట శివారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

నల్లచెరువు: మండల పరిధిలోని రాత్నాలపల్లికి చెందిన రవి నాయక్ కుమారుడు కార్తీక్ నాయక్ (25) శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆదివారం కదిరి ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. మృతదేహానికి నివాళులు అర్పించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తక్షణ సాయంగా రూ.10 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాస రెడ్డి కూడా కార్తీక్ నాయక్ మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ.10 వేలు అందజేశారు.

తేరన్నగారిపల్లిలో..

నల్లచెరువు: మండల పరిధిలోని తేరన్నగారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతురెడ్డి తండ్రి వెంకట శివారెడ్డి (85) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆదివారం గ్రామానికి విచ్చేశారు. శివారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ రయణారెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథనాయుడు, సింగల్ విండో డైరెక్టర్ ఆదిమూర్తి నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, మాధవరెడ్డి, మంజునాథ, సూర్యశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చిన్నపల్లి హరి, ఆకుల శ్రీనివాసులు,శంకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి


శ్రీలచ్చా నాయక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి పెడపల్లి పెద్ద తండాకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీలచ్చా నాయక్ (82) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీలచ్చా నాయక్ మృతదేహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎటువంటి పదవులూ ఆశించకుండా పార్టీ అభ్యున్నతికి శ్రీలచ్చా నాయక్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, సర్పంచ్ మంగ్లీబాయి, ఎంపీటీసీ సరస్వతీ బాయి, మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, నాయకులు మోహన్ నాయక్, ఓబులేశు, నరసింహులు, మురళీధర్‌రెడ్డి, కన్యాకుమారి, శేషాద్రిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

100 మందికి కంటి పరీక్షలు

ధర్మవరం అర్బన్: నిరుపేదల కోసం ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన శ్రీచక్ర ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కంటిచూపు తగ్గిన 100 మందికి కంటి పరీక్షలు చేశారు. పలువురిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కార్యదర్శి సుంకు సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, పీఆర్‌ఓ జయరాం, సభ్యులు డాక్టర్ సుబ్బారావు, పోలా ప్రభాకర్, చాంద్‌బాషా, రమేష్ బాబు, రంగనాథ్, వాసుదేవుడు, ఓటీ ప్రసాద్, రామచంద్రగుప్తా, శివప్రసాద్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల కన్వీనర్ల నియామకం

ధర్మవరం: పట్టణ సచివాలయాల కన్వీనర్లుగా ధర్మవరం పట్టణానికి చెందిన కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్‌ను వైఎస్సార్‌సీపీ నియమించింది. పట్టణంలోని 1వ వార్డు నుంచి 20వ వార్డు సచివాలయాలకు సచివాలయాల కన్వీనర్‌గా మాసపల్లి సాయికుమార్‌ను నియమించారు. 21వ వార్డు నుంచి 40వ వార్డు సచివాలయాలకు కన్వీనర్‌గా చందమూరి నారాయణరెడ్డిని నియమిస్తూ ఆదివారం అధికారికంగా ప్రకటించారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం కృష్ణాపురం సచివాలయ కన్వీనర్‌గా రఘునాథ్ యాదవ్‌ను వైఎస్సార్‌సీపీ నియమించింది. తన సేవలు గుర్తించి పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి రఘునాథ్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ అంజనప్ప ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి హాజరవుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

ఓడీ చెరువు ఎంఈఓ-1గా సురేష్



ఓడీ చెరువు: ఓడీ చెరువు ఎంఈఓ-1గా సురేష్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఎంఈఓ ఖాదర్‌వలిబాషా బదిలీపై వెళ్లారు. కాగా.. హెచ్‌ఎంగా పని చేస్తున్న సురేష్‌కు ఎంఈఓగా పదోన్నతి లభించింది.

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం

బత్తలపల్లి: జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా గుమ్మల్లకుంట గ్రామానికి చెందిన మాదిరెడ్డి జయరామిరెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పార్టీ నాయకులకు జయరామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

తాడిమర్రి: జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా శివంపల్లికి చెందిన అల్లే సాయినాథ్ రెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన ఎమ్మెల్యే కేతిరెడ్డి, మండల నాయకులకు అల్లే సాయినాథ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ముదిగుబ్బ: జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా ఎం.భాస్కర్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ధర్మవరం రూరల్: జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా పోతుకుంట గ్రామానికి చెందిన బి.శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

కర్ణాటక మద్యం స్వాధీనం

కదిరి టౌన్: ఖాద్రీ ఆలయం ముందు శివయ్య సత్రం ఉట్టి వద్ద ఉన్న 3వ అంగడిలో అనీష్ అనే వ్యక్తి కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు ఆదివారం పోలీసులకు సమాచారం అందింది. పోలీసులతో కలిసి సీఐ మధు దాడి చేశారు. 10 బీరు బాటిళ్లు, 30 క్వాటర్లు, 3 ఫుల్ బాటిళ్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీవర్స్ కాలనీకి చెందిన ఈశ్వర్ కర్ణాటక నుంచి మద్యం తెప్పించి అనీష్‌కు అమ్ముతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈశ్వర్, అనీష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు

అమడగూరు: అక్రమంగా మద్యం తరలిస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన కర్ణాటక బార్డర్ ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేశారు. గుట్కా, మద్యం అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

'ఎమ్మెల్యే కేతిరెడ్డిని విమర్శించే స్థాయి మీకు లేదు'


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ధర్మవరం: ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డిని విమర్శించే స్థాయి జనసేన పీఏసీ సభ్యుడు చిలకం మధుసూధన్‌రెడ్డికి లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రేగాటిపల్లి సర్పంచ్ అప్పిరెడ్డిగారి సురేష్‌రెడ్డి, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, సీనియర్ నాయకులు ఉడుముల రాము, తొండమాల రవి విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జనసేన పీఏసీ సభ్యుడు చిలకం మధుసూధన్‌రెడ్డి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. పబ్లిసిటీ స్టంట్, రాజకీయ ఉనికి కోసం ఎమ్మెల్యే కేతిరెడ్డిని గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమంలో పిల్లల్ని పనులకు వెళ్లద్దని చెబుతున్నారని విమర్శించడం దారుణమన్నారు. వాస్తవంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి నియోజకవర్గంలో బాల కార్మికులు అనే వారు లేకుండా ఉండాలన్న సంకల్పంతో పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించడం జరుగుతోందన్నారు. గతంలో పరిటాల రవి బినామీగా ఉండి ఆయన మరణానంతరం ఆస్తుల్ని కాజేసిన మధు ధనవంతుడయ్యారన్నారు. ఫ్యాక్షన్ , రౌడీయిజంతో ఎంతో మంది అమాయకుల భూములు కబ్జా చేసి కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. జోగోని కుంటలోని జనసేన కార్యాలయం ఉన్న భూమి కబ్జా చేసింది కాదా అని ప్రశ్నించారు. గతంలో నిన్ను గ్రామ బహిష్కరణ చేస్తే ప్రశాంతంగా ఉంటానని ఎమ్మెల్యే కేతిరెడ్డిని వేడుకున్న రోజులు మరచి పోయావా అని గుర్తు చేశారు. జనసేనలో ఉంటూ ఇటీవల పరిటాల శ్రీరామ్ ఇంటి ముందు వెళ్తుంటే వాహనాలు అడ్డు పెట్టి మరీ ఇంట్లోకి ఆహ్వానించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇతర ప్రాంతాల నాయకులు ధర్మవరంలో ఆధిపత్యం చేసుకోకూడదని నిత్యం వేదాలు వల్లె వేసే మధుసూదన్‌రెడ్డి రాప్తాడు నుంచి వచ్చిన పరిటాల శ్రీరామ్‌కు భజన చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా గతాన్ని మరచిపోకుండా సేవా దృక్పథంతో పని చేయాలన్నారు. ఒకరి పల్లకీ మోస్తూ అభివృద్ధికి మారుపేరు అయిన ఎమ్మెల్యే కేతిరెడ్డిని విమర్శించడం మానుకోవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జింకా కంబగిరి, గజ్జల శివ, సుభాన్, చింతా యల్లయ్య, బ్రహ్మ, కేశగాళ్ల క్రిష్ణ, తీర్థాల వెంకటరమణ, బ్రహ్మ, తోపుదుర్తి వెంకటరాముడు, అమర్‌నాథ్ రెడ్డి, పురుషోత్తం, బోగే కొండా, రవీందర్‌రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, బోగే కొండారెడ్డి, ఆదిరెడ్డి, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కే ముస్లింల మద్దతు


పథకాల కరపత్రాలను అందజేస్తున్న జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మొగల్ నూరుల్లా

తనకల్లు: ముస్లింలను అన్ని విధాలా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ముస్లింలు ఉంటారని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మొగల్ నూరుల్లా అన్నారు. మండల కేంద్రంతో పాటు కోటూరు, ఉస్తినిపల్లి, కొక్కంటిక్రాస్, కొండ వెనుకపల్లి, కొక్కంటి గ్రామాల్లోని మసీదుల ఇమామ్, మౌజన్లతో కలిసి 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించి ముస్లింల జీవితాలను మార్చివేశారన్నారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ ముస్లింల సంక్షేమ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మసీదుల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం ఆయా మసీదుల్లో కల్పించాల్సిన సదుపాయాలు, ఇమామ్, మౌజన్ల జీతభత్యాలను మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ అధికారులకు ఫోన్‌లో తెలియజేశారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సభ్యుడు తబ్రేజ్, మైనార్టీ నాయకులు ఎహసాన్, మహబూబ్ బాషా, ఫకృద్దీన్, ముజాహిద్, ముతవల్లి టోపీ ఖాదర్‌ఖాన్, ఇమామ్ ఇమాం ఖాసీం, మౌజన్ మహమ్మద్‌ఖాన్, మహబూబ్ బాషా, నూరుల్లా, మౌలాలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ


సత్యసాయి రథాన్ని లాగుతున్న భక్తులు

ప్రశాంతి నిలయం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని సత్యసాయి భక్తులు భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ప్రశాంతి నిలయం తూర్పు ద్వారం వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోకులం, ఎనుములపల్లి గణేష్ సర్కిల్, ఆర్‌వీజే పెట్రోల్ బంక్, చింతతోపుల మీదుగా రథాన్ని లాగారు. ప్రశాంతి నిలయం ఉత్తర ద్వారం వద్ద మంగళహారతితో ముగిసింది. భక్తులు సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలను ఆలపిస్తూ ముందుకు సాగారు.

నేడు 'స్పందన'

బత్తలపల్లి/తాడిమర్రి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్లు యుగేశ్వరి దేవి, నాగరాజు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు.

ఆటోను ఢీకొట్టిన లారీ

ముదిగుబ్బ: మండల పరిధిలోని క్రిష్టాపురం క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. బుక్కపట్నం మండలం యల్లంపల్లి గ్రామానికి చెందిన ప్రయాణికులు ఆటోలో బత్తలపల్లికి బయలుదేరారు. క్రిష్టాపురం క్రాస్ వద్దకు రాగానే స్పీడ్ బ్రేకర్ వద్ద డ్రైవర్ ఆటోను స్లో చేశాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీదేవి, నర్సింహమయ్య తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 సిబ్బంది నారాయణస్వామి, మల్లేసు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన నాగభూషణం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని దామాజిపల్లికి చెందిన బేల్దారి నాగభూషణం (26) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన మేరకు.. నాగభూషణం కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. ఎవరూలేని సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.


గాండ్లపెంట: అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


ధర్మవరం అర్బన్: సమావేశమైన పూర్వ విద్యార్థులు

నేస్తమా.. కుశలమా

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2002-03 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. 20 సంవత్సరాల క్రితం చదువుకున్న 180 మంది విద్యార్థులు ఒక చోట చేరడంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. పాఠశాల ఆవరణలో తిరుగుతూ గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, ఆదిరెడ్డి, లక్ష్మీనరుసు, రవీంద్రారెడ్డి, చంద్రశేఖర్, ప్రమదారాణి, సుజని, నాగమణి, ఖాదర్‌బాషా, సబాహనుల్లా, సుదర్శన్‌రెడ్డి, శంకర్‌బాబు, విశ్వనాథ్, విద్యా వలంటీరులుగా పని చేసిన సిద్దారెడ్డి, ఫయాజ్‌అలీ (జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు), ఖలీల్ తదితరులను సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు. సమావేశం అనంతరం పూర్వ విద్యార్థులు రక్తదానం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ముంతాజ్‌అలీ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: కన్న తల్లిని చదువుకున్న బడిని ఎప్పటికీ మరువరాదని ఉపాధ్యాయులు తెలిపారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో 2004-05 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు జీఎస్‌బీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పాఠశాలలో సందడి చేశారు. అనంతరం అప్పటి గురువులను సన్మానించారు.